వ్యవస్థలో మార్పునకు ఓటు నాంది

- దిల్‌సుఖ్‌నగర్‌లో విద్యార్థులతో 'సాక్షి' ఇష్టాగోష్టి
- అన్ని వర్గాలను సమదృష్టితో చూడాలి
- అన్ని వర్గాలకు ఉచిత విద్య కల్పించాలి


సాక్షి ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లో విద్యార్థుల ఇష్టాగోష్టి

చైతన్యపురి: గ్రామం.. నియోజకవర్గం...రాష్ట్రం.. దేనికైనా సమర్థుడైన నాయకుడ్ని ఎన్నుకుంటేనే అభివృద్ధి సాధించటమే కాక బంగారు భవిష్యత్‌కు పునాదులు వేయగలం. ప్రజాస్వామిక దేశంలో కుల, మత, లింగ, వర్గ, ప్రాంత బేధం లేకుండా ఓటును వినియోగించుకునే హక్కు ఉంది. అసెంబ్లీ ఎనికల్లో సమర్థవంతమైన నాయకుడిని ఎమ్మెల్యేగా ఎన్నుకుంటే స్థానిక సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి సాధ్యమవుతుంది. ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన ఆవశ్యకతపై నేటి యువత అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దిల్‌సుఖ్‌నగర్‌లోని చైతన్య అకాడమీలో బుధవారం 'సాక్షి' ఆధ్వర్యంలో ' ప్రజా ఎజెండా' పేరుతో విద్యార్థులతో చర్చాగోష్టి జరిగింది. వ్యవస్థలో మార్పుకు ఓటు నాంది కావాలని, సొంత లాభం మానుకుని సరైన నాయకుడికి ఓటు వేయాలని పలువురు విద్యార్థులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

- రాబోయే తరాలకు ఆదర్శంగా నిలిచే విధంగా ఓటు హక్కును వినియోగించాలని విద్యార్థులు పేర్కొన్నారు. ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యత లేకుండా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో నాయకులు ఇచ్చిన హామీలు నెరవేరేలా చూసుకోవాలన్నారు.
- కుల, మత ప్రాతిపదికన కాకుండా అందరికీ సమ న్యాయం చేసే వారిని గుర్తించి ఓటు వేయాలని, అన్ని వర్గాల విద్యార్థులకు ఉచిత విద్య కల్పించి, పోటీ పరీక్షలకు ప్రభుత్వమే ఉచితంగా శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, రిజర్వేషన్లతో కాకుండా మెరిట్ ప్రకారం ఉద్యోగావకాశాలు కల్పించాలని ఇష్టాగోష్టిలో విద్యార్థులు పేర్కొన్నారు.

ప్రజల బాగోగులు చూసే వారిని గెలిపించాలి



స్థానికంగా ఉండే సమస్యలను గుర్తించి పరిష్కరించి ప్రజల బాగోగులు చేసేవారిని గెలిపించాలి. కుల, మత. ప్రాంత ప్రాతిపదికన కాకుండా సమర్థుడైన నాయకుడిని ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలి. కులాల పేరుతో కాకుండా ఆర్థికంగా వెనుకబడిన వారందరికి రిజర్వేషన్లు కల్పించాలి. డబ్బులు తీసుకుని ప్రలోభాలకు లోను కాకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి.

– సౌమిక రెడ్డి, స్టూడెంట్

డబ్బులు తీసుకొని ఓటు వేస్తే ప్రజలకు నష్టం



రాష్ట్రమైనా, నియోజకవర్గం అయినా అభివృద్ధి చెందాలంటే ఓటు రాజకీయాలు పోవాలి. వ్యవస్థ మార్పుకు ఓటు నాంది కావాలనే ఆలోచన సమాజంలో రావాలి. డబ్బులు తీసుకుని ఓటు వేస్తే ప్రజలకు నష్టం జరుగుతుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నియోజకవర్గంలో మౌలిక వసతులు కల్పించే వారికి ఓటు వేయాలి. యువత చదువుకొనేలా ప్రభుత్వం ప్రోత్సహించాలి.

–జగదీష్‌రెడ్డి, విద్యార్థి

అన్ని రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించాలి



ఇంజినీరింగ్, వైద్య విద్య కాకుండా అన్ని రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించేలా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు చొరవ చూపాలి. ప్రస్తుతం ఉన్న విద్యా విధానాన్ని మార్చాలి. నిష్పక్షపాతంగా అన్ని సెక్టార్ల వైపు యువతను ప్రోత్సహించాలి. మెరిట్ ప్రకారం ఉద్యోగాలు కల్పించాలి. ఓటును ఆయుధంగా మార్చుకుని ప్రజా సంక్షేమం, ప్రాంతాల అభివృద్ధి చేసే వ్యక్తికి ఓటు వేసి గెలిపించుకోవాలి.

–దేవిశ్రీ, విద్యార్థిని

ఓటు వజ్రాయుధం



సమాజంలోని పేదల సంక్షేమానికి పాటు పడే వారిని ప్రజాప్రతినిధిగా ఎన్నుకోవాలి. నియోజకవర్గంలో జరగాల్సిన అభివృద్ధి పూర్తి అవగాహన ఉన్న వ్యక్తికి ఓటు వేయాలి, ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిది. ఓటు వేయకపోవటం అంటే ప్రభుత్వాలను ప్రశ్నించే హక్కు కోల్పోవటమే. ప్రలోభాలకు గురై ఓటు వేస్తే రాజ్యాంగం కల్పించిన ఓటుకు విలువ లేకుండా పోతుంది. ప్రతి నియోజకవర్గంలో ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు అయ్యేలా గెలుపొందిన ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.

–భవాని, విద్యార్థిని

బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: బీఆర్‌ఎస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోల్ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నాగోల్ డివిజన్‌లో యాదవ్ సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, పాడి పరిశ్రమల్లో భాగంగా అర్హులకు పశువులు అందేలా చూస్తామని, పశువుల ఆసుపత్రి కూడా ఏర్పాటు చేయిస్తానని, ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకాన్ని అర్హులకు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. యాదవ సంఘం సభ్యులకు తాను అన్ని విధాలుగా అండగా ఉంటానని, తనను ప్రతి ఒక్కరూ మనస్ఫూర్తిగా దీవించి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం మాజీ చైర్మన్ ఈశ్వరమ్మ యాదవ్, కుంట్లూరు వెంకటేష్ గౌడ్, సుర్వి రాజు గౌడ్, యాదవ సంఘం ప్రతినిధులు సతీష్ యాదవ్, కిరణ్ యాదవ్, కిషన్ యాదవ్, వెంకటేష్, భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

బీఫారం అందుకున్న సుధీర్‌రెడ్డి



ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి బుధవారం ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు బీఫారం అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ గడ్డపై గులాబీ జెండా ఎగురవేస్తామన్నారు. ఎమ్మెల్సీ యెగ్గె మల్లేషం, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో!

నాగోలు: తెలంగాణ గాడ్గే రజక సంఘాల ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని భగత్ సింగ్ యువజన సంఘం భవనంలో మంగళవారం రాత్రి రజక మహిళ బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో బడంగ్‌పేట నగర మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీఎన్‌రెడ్డినగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు. తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దవూరే బ్రహ్మయ్య, నాయకులు రాములు, వెంకటయ్య, నర్సింహ, గిరి, వెంకటేష్, బంగారు గీత, సంఘం రేణుక, ప్రేమలత, లలిత, రత్న, కవిత, సరిత, మంజుల, ప్రియాంక, తులసి పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న, రజక సంఘం మహిళలు

కళాశాలల్లో...

మలక్‌పేట/హస్తినాపురం: దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీసాయి డిగ్రీ, పీజీ కాలేజీలో, అనిబీసెంట్ మహిళా డిగ్రీ కాలేజీలో, గడ్డిఅన్నారం ప్రగతి డిగ్రీ కాలేజీలో, హస్తినాపురం డివిజన్ పరిధిలోని అనయ డిగ్రీ కళాశాలలో బుధవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొని బతుకమ్మ ఆడారు.


గడ్డిఅన్నారం ప్రగతి డిగ్రీ కాలేజీలో...


దిల్‌సుఖ్‌నగర్ శ్రీసాయి డిగ్రీ, పీజీ కాలేజీలో...

లక్ష్యాల సాధన దిశగా పయనించాలి

మలక్‌పేట: విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకునే దిశగా పయనించాలని దిల్‌సుఖ్‌నగర్ ఐడియల్ ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ మధుసూదన్ అన్నారు. వేవ్స్ 2023 పేరుతో బుధవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ డీన్ భాగ్యలక్ష్మి, కంప్యూటర్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ పద్మజ, లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫెడరల్ బ్యాంక్ శాఖ ప్రారంభం

లింగోజిగూడ: బ్యాంకుల్లో లావాదేవీలు సక్రమంగా ఉన్నప్పుడే బ్యాంకు యజమానులతో పాటు కస్టమర్లకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. కర్మన్‌ఘాట్ ప్రధాన రహదారిలో నూతనంగా ఏర్పాటుచేసిన ఫెడరల్ బ్యాంకు శాఖను బుధవారం ఆయన ప్రారంభించారు. డాక్టర్ కందాల మూర్తి, డాక్టర్ వేణుగోపాల్, ఫెడరల్ బ్యాంక్ జోనల్ హెడ్ దిలీప్, డివిజనల్ హెడ్ థామస్, బ్రాంచ్ మేనేజర్ వెంకటేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కళాసిల్క్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన



నాగోల్: అల్కాపురి కాలనీలోని అల్కాపురి భవన్‌లో కళాసిల్క్ హ్యాండ్లూమ్ ఇండియా వారి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌లో అన్ని రకాల చేనేత కళాకారులతో నేయబడిన కాటన్ చీరలు, చేనేత వస్త్రాలు అందుబాటులో ఉంచామని నిర్వాహకులు వినోద్ తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలో కళాకారులతో తయారు చేసిన చేనేత వస్త్రాలు అందుబాటులో ఉంచామన్నారు. చేనేత కళాకారులకు అండగా నిలవడానికి ఇటువంటి ఎగ్జిబిషన్లు ఉపయోగపడుతున్నాయన్నారు. ఎగ్జిబిషన్ ద్వారా కొనుగోలుదారులకు నాణ్యమైన వస్తువులు అందజేయనున్నట్లు తెలిపారు. వస్త్ర మేళాల ద్వారా చేనేత కార్మికులకు ఎన్నో ఉపాధి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు.

ఇంద్రసేనారెడ్డికి గవర్నర్ పదవిపై హర్షం



దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నేత నల్లు ఇంద్రసేనారెడ్డి త్రిపుర గవర్నర్‌గా నియమితులవడం పట్ల స్థానిక నేతలు, ఆయన శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. సౌమ్యుడు, మృదుస్వభావి, అందరు ఇంద్రన్న అని పిలుచుకునే ఇంద్రసేనారెడ్డికి సిటీలో ఎంతో అనుబంధం ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జన్మించిన నల్లు..ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మలక్‌పేట్ నియోజకవర్గానికి 3 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా , జాతీయ కార్యదర్శిగా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1983 నుంచి 1985 వరకు, 1985 నుంచి 1989 వరకు, 1999 నుంచి 2004 వరకు శాసనసభ్యునిగా కొనసాగారు.

బతుకమ్మ వేడుకలకు హోంమంత్రికి ఆహ్వానం

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ సరస్వతీనగర్ కాలనీలో ఈనెల 20న నిర్వహించే బతుకమ్మ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీని మాజీ కార్పొరేటర్ సామ స్వప్నాసుందర్‌రెడ్డి ఆహ్వానించారు. బుధవారం మంత్రిని ఆయన కార్యాలయంలో కలిసి వారు ఆహ్వానం పలికారు.హోంమంత్రిని కలిసిన వారిలో బీఆర్‌ఎస్ యాకుత్‌పురా ఇన్‌చార్జి సామ సుందర్‌రెడ్డి, కార్తీక్‌గౌడ్ ఉన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

వనస్థలిపురం: వనస్థలిపురం సచివాలయనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 4వ రోజు బుధవారం ఉత్సవ మూర్తులకు అభిషేకం, కుబేర హోమం, లక్ష తులసీ పుష్పార్చన, శ్రీవారి కల్యాణ మహోత్సవం, అన్నప్రసాద వితరణ, హనుమత్ వాహనంపై తిరువీధి ఉత్సవం, బ్రహ్మశ్రీ అద్దంకి శ్రీనివాసరావుచే లక్ష్మీ వైభవం-పురుషాకార స్వరూపం ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు.

'మాదిగల యుద్ధభేరి'ని విజయవంతం చేయాలి

నాగోలు: వచ్చే 5న ఇందిరా పార్క్ వద్ద జరిగే మాదిగల యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏబీసీడీ వర్గీకరణకు బిల్లును పెట్టి అమలు చేయాలని ఎమార్పీఎస్ టీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జీడీ నరసింహ మాదిగ, జాతీయ మహిళా అధ్యక్షురాలు రుక్కమ్మ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుగుణమ్మ డిమాండ్ చేశారు. నవంబర్ 5 ఇందిరా పార్క్ వద్ద జరిగే మాదిగల యుద్ధబేరి సభను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం ఎల్‌బీనగర్ ఎమార్పీఎస్ టీఎస్ అధ్యక్షుడు పంతం ఉపేందర్ ఆధ్వర్యంలో చైతన్యపురి డివిజన్ నుంచి ఎల్‌బీనగర్ వరకు ర్యాలీ నిర్వహించి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన 100 రోజుల లోపే ఏబీసీడీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెడతామని బీజేపీ హామీ ఇచ్చి ఇప్పటివరకు కూడా అమలు చేయలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం పెద్దగా నేను ముందుండి ఏబీసీడీ వర్గీకరణకు సహకరిస్తానని చెప్పి ఇప్పటివరకు ఆ ఊసే ఎత్తలేదన్నారు. మాదిగ జాతిని కేవలం ఓటు బ్యాంకుగా మారుస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెంప పెట్టుగా, వర్గీకరణకు సహకరిస్తున్నవారికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు సంఘపాక యేసోబు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మంద జయన్న, ఎల్‌బీనగర్ ఇన్‌ఛార్జి కూరుపాటి జగదీష్, మొండి కత్తి ఎల్లయ్య, లక్ష్మయ్య, నాయకులు నల్ల నాగరాజు, కొమ్ము సైదులు, కొమ్ము మల్లూర్, కొమ్ము శ్రీను, బరిగల రామకృష్ణ, శశి, ఏడెల్లి మహేష్, దేశ పాంగు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


యుద్ధభేరి సభ కరప్రతాలను విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకులు

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురికి జైలు

చాదర్‌ఘాట్: మద్యం తాగి పోలీసుల విధులకు ఆటంకం కల్గించిన ముగ్గురికి న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. బుధవారం చాదర్‌ఘాట్ సీఐ ప్రకాష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...మూసానగర్‌కు చెందిన కైరత్ పాషా (35), మహ్మద్ మొహిన్‌ఖాన్ (25), మహ్మద్ అజమ్ అలీఖాన్(23)లు ఈ నెల 18వ తేదీ రాత్రి మలక్‌పేట గంజ్‌లో మద్యం తాగి న్యూసెన్స్ చేసి పోలీసుల విధులకు ఆటంకం కల్గించారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురినీ నాంపల్లి కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ నాలుగు రోజులు జైలుశిక్షతో పాటు రూ. 250 జరిమానా విధించారని సీఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సెక్కు.. నగదు బహుమతి పట్టు!

హయత్‌నగర్: దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా టీఎస్ ఆర్టీసీ తమ ప్రయాణికులకు లక్కీ డ్రా ద్వారా బహుమతులు అందిస్తున్నట్లు హయత్‌నగర్-1 డిపో మేనేజర్ జలగం విజయ్ తెలిపారు. బుధవారం ఆయన హయత్‌నగర్ బస్టేషన్‌లో లక్కీ డ్రా బాక్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆర్టీసీలో ప్రయాణించేవారిని ఆకర్షించేందుకు పలు పథకాలను అమలు చేస్తున్నదని చెప్పారు. ఇందులో భాగంగా ప్రతి రీజియన్ పరిధిలో బుధవారం నుంచి ఈనెల 30 వరకు రోజుకు ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలకు.. ఒక్కొక్కరికి రూ.9,900 చొప్పున.. మొత్తం 110 మందికి రూ.11 లక్షలు బహుమతిగా అందజేస్తామన్నారు. ప్రయాణికులు తమ టికెట్ వెనుక ఫోన్ నెంబర్‌ను రాసి స్త్రీ, పురుషులకు వేరు వేరుగా కేటాయించిన డ్రా బాక్సుల్లో వేయాలని సూచించారు.


హయత్‌నగర్ బస్ స్టేషన్‌లో డ్రా బాక్స్‌లో కూపన్లు వేస్తున్న ప్రయాణికులు

రౌడీషీటర్ల కదలికలపై ఫోకస్

ఇప్పటికే 80 శాతం బైండోవర్ పూర్తి


రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

చాదర్‌ఘాట్: వచ్చే నెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఉద్రిక్తతలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా చాదర్‌ఘాట్ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనుగుణంగా పోలింగ్, ప్రచార, పాదయాత్రలు, రోడ్‌షోల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వారం రోజులుగా తనిఖీలు ముమ్మరం చేశారు. రౌడీషీటర్లతో పాటు అనుమానితుల కదలికలపై దృష్టి సారించారు. ముఖ్యంగా బ్లూకోట్స్, పెట్రోలింగ్ పోలీసుల పాయింట్ బుక్స్ చెకింగ్ ద్వారా సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. గత ఎన్నికల సమయంలో ఎక్కడెక్కడ ఘర్షణ, గొడవలు జరిగాయి, మద్యం పంపిణీ, గొడవలకు కారణాలు కోణంలో పోలీసులు తమ ప్రాంతంలో మ్యాపులు రూపొందించుకొని నివేదికలు సిద్ధం చేసుకోవడమే కాకుండా ఆ ప్రాంతాలను జియో ట్యాగింగ్ చేశారు. చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్‌లో 29 మంది రౌడీషీటర్లు ఉండగా దాదాపు 20 మందిని బైండోవర్ చేశారు. దాదాపు 80 శాతం బైండోవర్ పూర్తైంది.

దోభీఘాట్‌లో సౌకర్యాల మెరుగుకు కృషి: ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: దోభీఘాట్‌లో సౌకర్యాలు మెరుగుపర్చేందుకు కృషి చేస్తామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. తెలంగాణ రజక దోభీ అభివృద్ధి సంస్థ మూసారంబాగ్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం శ్రీపురం కాలనీ రజక సంఘం కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రజకుల సమస్యలను పరిష్కారించే విధంగా చూస్తామన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో ఎక్కడా కూడా రాజీ పడలేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, మూసారంబాగ్ కమిటీ చైర్మన్ యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి మావురం నర్సింహ, సంఘం నాయకులు రవీందర్, సురేందర్, జంగయ్య, యాదయ్య, శంకర్, శ్రీరాములు, యాదగిరి, రాజేష్, జ్ఞానేశ్వర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఘనంగా ఈదమ్మ విగ్రహ ప్రతిష్ఠ..

మూసారంబాగ్ డివిజన్ శ్రీపురం కాలనీలో రజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఈదమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, బొడ్రాయి, గోపుర శిఖర ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో పురోహితులు గణపతి పూజ, పుణ్యాహవచనం, క్షీరాధివాసం, పంచగవ్యాధివాసం, పుష్పాభిషేకం, హోమం, గర్భపూజ, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

బతుకమ్మ ఘాట్‌ను సిద్ధం చేయండి

సైదాబాద్: సద్దుల బతుకమ్మ వేడుకలలోపు బతుకమ్మ ఘాట్‌ను సిద్ధం చేయాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం డివిజన్ పరిధిలోని సింగరేణి ఆఫీసర్స్ కాలనీలో సరూర్‌నగర్ చెరువుకు ఆనుకొని ఉన్న బతుకమ్మ ఘాట్ వద్ద నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను కార్పొరేటర్ స్థానికులతో కలిసి పరిశీలించారు.

మందకృష్ణ మాదిగ పాదయాత్రకు స్వాగతం


మందకృష్ణకు స్వాగతం పలుకున్న దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు చేపట్టిన పాదయాత్ర బుధవారం మహేశ్వరం నియోజకవర్గానికి చేరుకుంది. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్‌కు ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ, మహేశ్వరం నియోజకవర్గ ప్రజలు అండగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు నల్లెంకి ధన్ రాజ్ గౌడ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బాకీ జాను, సరూర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ఇమ్రాన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ.. దీవించు


శ్రీసాయినగర్‌లో మహాలక్ష్మీ అలంకరణలో దుర్గాదేవి


కర్మన్‌ఘాట్‌లో మహాలక్ష్మీగా సరస్వతీదేవి


అన్నపూర్ణదేవి అలంకరణలో ప్రత్యంగిరా దేవి


ప్రత్యంగిరా దేవి ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు


ఖిల్లా మైసమ్మ ఆలయంలోని దుర్గామాతను దర్శించుకున్న చిలుక ఉపేందర్‌రెడ్డి

ఘనంగా దేవీనవరాత్రి ఉత్సవాలు

మన్సూరాబాద్/దిల్‌సుఖ్‌నగర్: ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో దేవీనవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయాలు, అమ్మవారి మండపాల వద్ద ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయి. పూజల్లో స్థానికులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పాల్గొంటున్నారు.

- నాగోలు డివిజన్ శ్రీసాయినగర్‌లోని దుర్గాదేవి గుడిలో అమ్మవారు బుధవారం మహాలమీ అలంకరణలో, ఆర్‌కేపురం డివిజన్‌లోని కుర్తాళం పీఠంలోని ప్రత్యంగిరా పరమేశ్వరి అన్నపూర్ణ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ప్రత్యంగిరా దేవిని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు సోమేశ్‌కుమార్ సతీమణి జ్ఞానముద్ర దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయంలోని సరస్వతీదేవిని మహాలక్ష్మీగా అలంకరించి పూజలు నిర్వహించారు.


మన్సూరాబాద్ పోచమ్మ గుడిలో చైర్మన్ విఠల్‌రెడ్డి


ప్రత్యంగిరా దేవిని దర్శించుకున్న సోమేశ్ కుమార్ సతీమణి జ్ఞానముద్ర